# గంగమ్మ

వాడూ నేనూ ఈ ఊరు వచ్చి ఏడాది అవుతోంది. పల్లెలో మాకు బతుకు సాగలేదు. ఈ బస్తీలో కూలో నాలో చేసుకు బతకవచ్చుని అనుకున్నాం. బయలుదేరి వచ్చాం-వాడూ, నేనూ, మా పసిపాప. దానికి మూడు నెల్లు. ఒక సంచిలో కాసిని గుడ్డలు, రెండు గిన్నెలు తెచ్చుకున్నాం. అంతకన్నా మాకు ఆస్తిలేదు.

మా అదృష్టం. రాగానే మాకు పని దొరికింది. ఊరి చివరనుంచి గంగానమ్మ గుడిదాకా తారురోడ్డు వేస్తున్నారు. అక్కడ కూలి పని దొరికింది. రాణి ఇంద్రాణీదేవి ఈ ఊళ్ళోకల్లా ధనవంతురాలట. ఆమె తోట గంగమ్మగుడికి అవతల పక్కగా ఉందిట. ఆమె రోజూ ఆ తోటకు సాయంత్రం షికారు వెళుతుంది. ఆమె కారు వెళ్ళటానికి ఈ మామూలు రోడ్డు బాగులేదు. అందుకని మునిసిపాలిటీవాళ్ళు చాలా కష్టపడి మూడు మైళ్ళ దూరం తారురోడ్డు వేస్తున్నారు. పాపం ఆవిడది చాలా పెద్దకారు. రేడియో కూడా ఉంది. మట్టిరోడ్డులో వెళితే కారు పాడై పోతుంది.

అంతకూ మా అదృష్టం బాగుండి మాకు కూలి పని దొరికింది. వాడికి ఆరు, నాకు నాలుగు. రోజుకు పది రూపాయలు దొరుకుతాయి. తిండికి ఫరవాలేదు. ఎక్కడ ఉండడం అన్న సమస్య లేదు. ఈ పని పూర్తి అయ్యేదాకా ఈరోడ్ల ప్రక్కనే ఇక్కడే ఉంటే బాగుంటుంది అనుకున్నాము. పనిచేసుకుంటూ బిడ్డను చూసుకుంటూ ఉండొచ్చు అనుకున్నాము.

ఇక్కడ పెద్ద మర్రిచెట్టు ఉంది. దాని కొమ్మలు విశాలంగా ఉన్నాయి. ఆ చెట్టు నీడన ఎంతమందైనా ఉండొచ్చు. అక్కడే మేమూ

ఉన్నాము. చెట్టుకొమ్మకు గుడ్డఉయ్యాల కట్టుకున్నాము పాపను పడుకోబెట్టుకోడానికి. ఆ చెట్టుకిందే మూడు బండలు పెట్టుకుని, కాసిని పుల్లలు తెచ్చుకుని కూడు వండుకున్నాం. రాత్రికి చల్లగా ఆ చెట్టునీడనే పడుకున్నాం. అదృష్టంకొద్దీ అది ఎండాకాలం, వర్షం రాలేదు. అంచేత ఫరవాలేదు. తల్లిలాంటి మర్రిచెట్టు మధ్య మధ్యన చల్లటిగాలి వీచి మాకు ఊపిరి పోసింది.

రెండు నెలలు గడిచాయి. రోడ్డు పని పూర్తి అయింది. ఇప్పుడు రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. ఈ పక్కన జనసందడి తక్కువే. ఇప్పుడు ఎక్కడికి పోవాలి. ఏం చెయ్యాలి అని ప్రశ్న పట్టుకుంది. రెండు నెలలు ఉంటే ఈ మర్రిచెట్టు మా సొంతంలా అనిపించింది. దాన్ని వదలిపెట్టి పోవడానికి మనసు రాలేదు. వాడూ నేనూ అనుకున్నాం. ఈ చెట్టుకిందే ఇక్కడే ఒక చిన్న గుడిసె వేసుకుని, ఒక చిన్న అంగడి పెట్టుకుంటే బాగుంటుందని. ఎక్కడికీ పోనక్కరలేదు. కూలీ నాలీ వెతుక్కోనక్కరలేదు. ఏవో చిల్లర సామానులు పెట్టుకుంటే ఏదో బేరం సాక్కపోతుందా! గుడికి పొయ్యే జనం. వచ్చే జనం! అప్పుడప్పుడూ వస్తూ పోతూనే వుంటారు. ఏదో ఇద్దరు మనుషులం బతకలేకపోతామా ! రోజుకు రెండు రూపాయలు గిట్టినా చాలు. అంతే ఇక్కడే ఉందామని అనుకున్నాము. కూలీలో మేము కొంత డబ్బు దాచుకున్నాము. నా కాలి అందెలు, చేతి మురుగులు అమ్మి చిన్నపాక వేసుకున్నాము పక్కనే చిన్న అంగడి పెట్టుకున్నాము. ఏదో బేరం సాగుతూనే వుంది. ఏదో రోజులు గడుస్తూనే వున్నాయి. రోజురోజుకు మా పాప కాస్త పెద్దది అవుతుంది.

రాణి ఇంద్రాణీదేవి రోజూ తన పెద్దకారులో తన తోటకు ఈ తోవనే వెడుతుంది ఎన్నోసార్లు ఆమెను చూశాను. ఒక్కతే వెడుతుంది. ముందుసీట్లో డ్రైవరు, వెనక సీట్లో ఆమె. అవిడ తెల్లగా నాజూగ్గా

ఉంటుంది. చీరకొంగుతో తల కప్పుకుంటుంది. మనిషి ఎంత అందంగా ఉంటుంది ! అదృష్టం ! డబ్బు ఉన్నవాళ్ళంతా అందంగా సుకుమారంగా ఉంటారు. డబ్బులేనివాళ్ళంతా కష్టపడి పనిచెయ్యటం చేతో ఏమో బలంగా మొరటుగా ఉంటారు. లేకపోతే నీరసంగా నిస్త్రాణగా ఉంటారు. ఇంద్రాణీదేవిలా దర్పంగా తేజసం ఉట్టిపడుతూ ఉండరు. ఎందుకో ఈ విధి వైపరీత్యం !

ఒకరోజు ఇంద్రాణీదేవి కారు సరిగ్గా మా పాకదగ్గర ఆగింది. అటు నుంచి తాత మేకలను తోలుకువస్తున్నాడు. మేకలన్నీ రోడ్డుకు అడ్డంగా గుంపుగా ఉన్నాయి. అంచేత కారుకు ఒక్కక్షణం ఆగక తప్పలేదు. ఆ ఒక్కక్షణంలో ఆమె ఒకసారి తలతిప్పి మా గుడిసెకేసి చూసింది. నేను భయంతో ఆమెకేసి చూస్తూ నిలుచున్నాను. ఎందుకో ఆమె చూపు ప్రసన్నంగా లేదు. "ఈ గుడిసె ఇక్కడ ఎందుకుఉంది" అన్నట్లు ఉంది. అందమైన ఆమె కళ్ళకి మా గుడిసె పక్కనే ఉన్న మా చిన్నఅంగడి, చెట్టు కొమ్మకు వేలాడుతున్న మా పాప ఉయ్యాల. అన్నీ బహుశా అంద వికారంగా కనిపించాయేమో ! నా గుండె దడదడా కొట్టుకుంది. అంతే ! మేకలు తోవతప్పుకున్నాయి. కారు ముందుకు సాగిపోయింది. అయినా నా గుండెల్లో భయం పోలేదు. దడదడా కొట్టుకుంటూనే ఉంది. ఇంద్రాణీదేవి చూపులు మనసులో ఎందుకో ముల్లుల్లా గుచ్చుకుంటున్నాయి. ఆ రాత్రి నాకు నిద్దరపట్టలేదు.

నాలుగు రోజుల తరువాత ఒక జవాను వచ్చాడు. ఒక కాగితం పట్టుకువచ్చాడు. నాకు చదువురాదు. వాడు ఊళ్ళో లేడు మా అత్తకు ఒళ్ల బాగలేదంటే చూట్టానికి వెళ్ళాడు. ఆమె మా మరిది దగ్గర ఉంటోంది. ఆకాగితం పుచ్చుకున్నాను ఆ జవాను నా వేలిముద్ర తీసుకున్నాడు. అతన్నే అడిగాను "ఏమిటిది?" అని. అతను చెప్పాడు "ఈ రోడ్డుపక్క ఊజాగా

అంతా మునిసిపాలిటీది. ఇక్కడ ఎవరూ గుడిసెలు వేసుకోగూడదు. నాలుగు రోజుల్లో ఖాళీ చేసిపోవాలి” అని. అంతే. అతను వెళ్ళిపోయాడు. నాకు దిగులు పట్టుకుంది. ఇప్పుడు నేను ఎక్కడికి వెళ్ళను ? వాడు ఊళ్ళో లేడు. ఎప్పుడు వస్తాడో తెలియదు. ఎండాకాలం పోయి వానాకాలం వచ్చింది. ఎక్కడికి పోను ? వాడు వచ్చిందాకా అయినా ఆగాలికదా ? దిక్కుతోచలేదు. దేవుడిమీద భారం వేసి వూరుకున్నాను.

నాలుగు రోజులు గడిచాయి. వాళ్ళు వచ్చారు “గుడిసెలు తీసెయ్యాలి” అన్నారు. నేను తెల్లమొహం వేసుకు నించున్నాను. వాళ్ళు మా గుడిసెకు వున్న నాలుగు తడికెలు విప్పి దూరంగా పారవేశారు. అంగట్లో ఉన్న నాలుగు సామానులు క్రింద కుప్పపోశారు. చెట్టుకొమ్మకు ఉన్న పాప ఉయ్యాలి ఊడదీశారు. అంతే. వచ్చినపని అయిపోయినట్లు వాళ్ళతోపన వాళ్ళు పోయారు. నాకు ఏడుపు వచ్చింది అయినా ఏడవలేదు ఏడవటానికి కూడా ఓపిక లేనట్లనిపించింది పాపకు జ్వరం. జోరున వాన కురుస్తోంది. వాడు లేడు. ఏం చెయ్యాలిప్పుడు ? అక్కడే ఆ చెట్టుకిందే కూలబడ్డాను. పాప తడవకుండా చీరకొంగు నిండా కప్పాను. మేకలు మేపే తాత వచ్చాడు సంగతి చూశాడు. “అమ్మా! రా! మా గుడిసెకు పోదాం !” అన్నాడు. తాత గుడిసె రోడ్డుకు దూరంగా వుంది. ఆ జాగా మునిసిపాలిటీది కాదు. తాత కొన్నిసామాన్లు తీసుకున్నాడు. పాపను ఎత్తుకున్నాడు నేను మిగతా సామాన్లు తీసుకున్నాను. అతని వెంట పోయామ. అప్పుడు మళ్ళా ఏడుపు వచ్చింది. ఏడుస్తూ పోయాను.

వారం రోజులకు వాడు వచ్చాడు. వాడితల్లి పోయింది. చెట్టు దగ్గర చూసుకుని తాతగుడిసె వెతుక్కుంటూ వచ్చాడు. సంగతి విని వాడూ కాస్సేపు దిగాలుపడి కంటతడిపెట్టుకున్నాడు. కాసేపు బాధతో కుతకుతలాడి చేసేదిలేక ఊరుకున్నాడు. మళ్ళా మామూలుగా జీవితయాత్ర మొదలు

పెట్టాం. తాత గుడిసె పక్కనే చోటుచేసుకున్నాం. వాడు కూలికి పోతున్నాడు. రోజులు గడుస్తున్నాయి.

నా మనసులో బాధ పోలేదు. ఎందుకో నా గుడిసె కూలిపోవడానికి ఇంద్రాణీదేవి కారణమని నా మనసులో గట్టిగాపట్టుకుంది. ఆవిడ ఒక్క క్షణం నాకేసి చూసినప్పుడే నాకు భయంవేసింది నేనేమీ ఆమెకు అపకారం చెయ్యలేదే! ఆమె ఎందుకు నా గుడిసె ఊడబీకించింది అనిపించింది. ఒకరోజు బజారుకు వెళ్ళినప్పుడు ఆమె ఇంటివైపు వెళ్ళాను. మూడంతస్థుల మేడ ఇల్లు కనిపించకుండా మైలుదూరం ఇంటిచుట్టూ తోట. గేటులో గూర్ఖా—దూరాన్నుంచి చూస్తేనే కడుపులో భగ్గుమంది "ఇంత మంచి ఇంటిలో ఉంటూ చెట్టు నీడన నేను తలదాచుకుంటే ఎందుకు చూసి ఓర్వలేక పోయింది?" అనిపించింది, ఆమెకు ఇందులో ఏమైనా సంబంధం ఉన్నదో లేదో తెలియదుగాని నాకుమాత్రం నా కష్టాలకు ఆవిడే కారణం అన్నట్లు మనసులో ఏదో ద్వేషం పట్టుకుంది.

మనసులో ద్వేషం ఉండటం మంచిది కాదు కాని ఎందుకో నా కడుపులో భగ్గున మండి ద్వేషం తగ్గటంలేదు. ఎప్పటికైనా నాబాధ ఆమెకు అర్ధం కావాలి. నా కడుపులో చిచ్చు ఆమెకు తెలియాలి.' ఇదే అమ్మవారికి నా ప్రార్ధన.

ఒకరోజు గంగమ్మ గుడికి వెళ్ళాను. గంగమ్మ నామాట వింటుంది, నా బాధ అర్ధం చేసుకుంటుంది. నేను మట్టిలో పొర్లాడుతూఉంటే ఇంద్రాణీదేవి ఏమీ పట్టనట్లు పట్టుపాన్పులమీద పవళిస్తూ ఉంటే అమ్మవారు చూసి సహించదు. నా దశ ఆమెకూ పడుతుంది. ఇది నా పేరాశ, నా నమ్మకం ఒక పళ్లెంలో కొబ్బరికాయ, కుంకుమ, ఒక రూపాయి, రవికల గుడ్డ పెట్టుకున్నాను. అమ్మవారి గుడికి వెళ్ళాను గుడిదగ్గర పెద్ద కారు ఆగి వుంది. అది దాటి ముందుకు వెళ్ళాను. అక్కడ ఒక జవాను నుంచుని

ఉన్నాడు. "ఆగు. ఇప్పుడు లోపలికి వెళ్ళటానికి వీలులేదు" అన్నాడు. నేను తెల్లబోయాను "ఇంద్రాణీదేవి లోపల పూజ చేస్తున్నారు." అన్నాడు. నా కళ్ళు బైర్లు కమ్మాయి. కటకటాలలోంచి లోపలికి చూశాను. ఇంద్రాణీదేవి పెద్ద పళ్లెం పుచ్చుకుని నిలుచుని ఉంది. పూజారి వచ్చి పళ్లెం అందుకున్నాడు. అందులో గులాబీపూలు, ఆపిల్ పండ్లు, పెద్ద బనారసు పట్టు చీరా కనిపించాయి. నాకు సిగ్గేసింది. నా చేతిలో పళ్ళెం చూసుకున్నాను. ఇంచుమించు వెలిసిపోయిన రవికలగుడ్డ కనిపించింది. కళ్ళు చెమ్మగిల్లాయి. అమ్మవారు అంత పెద్ద పట్టుచీరను ఆదరిస్తుందా ? లేక చాలీచాలని ఈ పేదరాలి రవికల ముక్క ఆదరిస్తుందా ? దేవుడు కూడా డబ్బున్నవాళ్ళ పక్షమే అనిపించింది డబ్బున్నవాళ్ళకు లోపల ప్రవేశం. మిగతావాళ్ళు బయట నిలబడవలసిందే. పూజారి ఇంద్రాణీదేవికి శఠగోపం పెడుతున్నాడు. తీర్థం ఇస్తున్నాడు. కటకటాల ఇవతలి నుంచి నాకు అమ్మవారి ఆకారం కూడా కనిపించటంలేదు. నిస్పృహతో చేతిలో పళ్ళెం కింద జారవిడిచాను. ఉసూరుమంటూ వెనక్కి మళ్ళి వెళ్ళిపోయాను. దిక్కులేనివారికి దేవుడే దిక్కు అంటారు. కాని ఆ దేవుడికి కూడా పక్షపాతమే. నా ఆర్తి వినే దెవరు ? నా ఆశలు అడియాసలయ్యాయి. అంతా శూన్యంగా తోచింది. ఎక్కడా వెలుగు కిరణం కనిపించలేదు.